క్లుప్తంగా

భీం విగ్రహావిష్కరణ


భీం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

సిరికొండ: మండలంలోని రాయిగూడ గ్రామంలో శుక్రవారం ఆదివాసీల పోరాట యోధుడు కుమురం భీం విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గిరిజనుల హక్కుల కోసం తన ప్రాణాలను లెక్క చేయకుండా నిజాంలతో పోరాడిన తీరు మనకు ఆదర్శం అని కొనియాడారు. కార్యక్రమంలో నీలాదేవి, ఆత్రం భాస్కర్, కర్యకర్తలు, గ్రామ పటేల్, సార్‌మెడిలు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజ్‌వీర్

నేరడిగొండ: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. శుక్రవారం మండలంలోని దర్బతండా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. మొదటగా పాఠశాలలో రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి అరుణ్, ప్రియాంక, తదితరులు ఉన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు


టీకా వేస్తున్న పశువైద్యాధికారి రాథోడ్ జీవన్

నేరడిగొండ: పశుపోషకులు, రైతులు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని పశు వైద్యాధికారి రాథోడ్ జీవన్ అన్నారు. శుక్రవారం మండలంలోని బుగ్గరాం గ్రామంలో సామూహిక గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. 922 పశువులకు టీకాలు వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది వెంకన్న, నరేందర్, సురేశ్, శివప్రసాద్, రైతులు పాల్గొన్నారు

'కంది'కి సన్మానం


కందిని సన్మానిస్తున్న కౌన్సిలర్లు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణానికి రూ.10 కోట్ల సీఆర్‌ఆర్ గ్రాంట్స్, ఎస్‌డీఎఫ్ రూ.4కోట్ల చొప్పున రూ.14 కోట్లు మంజూరు చేయించినందుకు ను కాంగ్రెస్ కౌన్సిలర్లు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ప్రజాసేవ భవన్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డిని శాలువాతో సత్కరించారు. పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి, గిమ్మ సంతోష్, మున్సిపల్ కౌన్సిల్ ఫోరం జిల్లా అధ్యక్షుడు బండారి సతీష్, జహీర్ రంజాని, కలాల శ్రీనివాస్, సందా నర్సింగ్, లక్ష్మణ్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

నేడు బస్‌పాస్ మేళా

నేరడిగొండ: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం దివ్యాంగులకు బస్‌పాస్ మేళా నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజ్‌వీర్ ఒక ప్రకటనలో తెలిపారు. అంధులు, చెవిటి, మూగ, మానసిక స్థితితో బాధపడుతున్న వారి కోసం ఈ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బస్‌పాస్ కోసం హాజరయ్యే వారు సదరమ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్టు సైజు ఫొటో, రూ. 50 చెల్లించి బస్‌పాస్ తీసుకోవాలని కోరారు.

సన్మానం

తాంసి: భీంపూర్ మండల విద్యుత్‌శాఖ ఏఈగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన తిరుపతిరెడ్డిని శుక్రవారం సిబ్బంది సన్మానించారు. భీంపూర్ మండలంలోని నిపాని సబ్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో నూతన ఏఈతో పాటు బదిలీపై వెళ్లిన ఏఈ శ్రావణ్ కుమార్, సబ్‌ఇంజనీర్ సాయి, లైన్ ఇన్‌స్పెక్టర్ వసంత్‌లను శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

దండారీ ఉత్సవాలు ప్రారంభం


ఇచ్చోడ: గుస్సాడీ టోపీలకు పూజలు చేస్తున్న ఆదివాసీలు

ఆదివాసీ గ్రామాల్లో దండారీ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలో ఆదివాసీలు బోగి పూజలతో దండారీ ఉత్సవాలను ప్రారంభించారు. ఇంద్రాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కలు చెల్లించుకున్నారు. గుడిహత్నూర్ మండలంలోని సోయంగూడ గ్రామానికి చెందిన గుస్సాడీలు ఇంద్రాదేవి ఆలయానికి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం దండేపల్లి మండలంలోని గుడిరేవు పద్మల్‌పురి కాకో ఆలయానికి తరలివెళ్లారు. ఇచ్చోడ మండలంలోని మాన్కుగూడ గ్రామంలో గుస్సాడీ టోపీలు, ఇతర సామగ్రికి పూజలు చేశారు. ఈసందర్భంగా గుస్సాడీ సంబురాలను ప్రారంభించారు. – ఇంద్రవెల్లి, ఇచ్చోడ


ఇంద్రవెల్లి: మొక్కులు తీర్చుకుంటున్న గుస్సాడీలు



ఇంద్రవెల్లి: జెండా వద్ద పూజలు చేస్తున్న ఆదివాసీలు

సీఎంను విమర్శించడం సరికాదు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఉట్నూర్‌రూరల్: సీఎం రేవంరెడ్డిని బీఆర్‌ఎస్ నాయకుడు కేటీఆర్ విమర్శించడం సరికాదని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. ఓర్వలేక బీఆర్‌ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ హయాంలో చేయని అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తున్నామన్నారు. బీఆర్‌ఎస్ ప్రజలకు ఏం చేశారో చెప్పాలన్నారు. సమావేశంలో నాయకులు ఖయ్యుం, చంద్రయ్య, ఎక్బాల్, మర్సుకోల తిరుపతి, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ శ్రేణుల ఆగ్రహం

- దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన

కైలాస్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డిని పరుష పదజాలంతో దూషించడం కేటీఆర్ దురహంకారానికి నిదర్శనమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రజాసేవ భవన్ వద్ద కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. కేటీఆర్‌కు వ్యతిరేకంగా నినదాలు చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాలరాసేలా కేటీఆర్ సీఎంకు వ్యతిరేకంగా మాట్లాడటం శోచనీయమన్నారు.

- నేరడిగొండ: కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలని బోథ్ నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రఫుల్ చందర్ రెడ్డి అన్నారు. మండలం కేంద్రంలో శుక్రవారం కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. రైతు రుణమాఫీ గురించి మాట్లాడే అర్హత కేటీఆర్‌కు లేదన్నారు.
- తలమడుగు: మండలంలోని సుంకిడి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, మాజీ జెడ్పీటీసీ గణేశ్ రెడ్డి, మాట్లాడుతూ కేటీఆర్ అహంకారంతో సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.


కైలాస్‌నగర్: ఫ్లెక్సీ దహనం చేస్తున్న నాయకులు

- ఇచ్చోడ: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇచ్చోడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమూద్‌ఖాన్ మాట్లాడుతూ టీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులను పట్టించుకోని వారు నేడు ప్రతిపక్షంలో రైతులపై కపడ ప్రేమను వలకబోస్తున్నారని విమర్శించారు.
- ఎదులాపురం: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రైతుల సంక్షేమం గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు.


గుడిహత్నూర్‌లో..

శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని ఆరోపించారు. సబ్సిడీలు ఎత్తివేయడం, ప్రధానమంత్రి ఫసల్ బీమా అమలు కాకుండా మొండి చేయి చూపిన ఘనత బీఆర్‌ఎస్‌ది అని ఎద్దేవా చేశారు.

- గుడిహత్నూర్: ప్రజాధనాన్ని కొల్లగొట్టి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన ఘనత కేసీఆర్ ఫ్యామిలీదని కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ ఆరోపించారు. కేటీఆర్ వ్యాఖ్యలను ఖండిస్తూ బస్టాండ్ వద్ద కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. రేవంత్ రెడ్డి పని తీరును ఓర్వలేక రైతులను అడ్డం పెట్టుకొని నీచ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.

పథకాల అమలుపై చిత్తశుద్ధి లేదు

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తాంసి: సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని మత్తడివాగు ప్రాజెక్టులో చేపపిల్లలు విడుదల చేశారు. చెరువులో చేపపిల్లలను పట్టుకొని గంగాపుత్రులు ఉపాధి పొందే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం చేపపిల్లలను వదులుతుందన్నారు. దీంతో ఉపాధి ఎలా పొందుతారని ప్రశ్నించారు. చెరువుల్లో నీరు తగ్గే సమయంలో చేపపిల్లలను వదులడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి సాంబశివ్, ఎంపీడీవో గడ్డం మోహన్ రెడ్డి, కృష్ణ, రజనీకాంత్ రెడ్డి, అభిరాం, మొట్టె కిరణ్, కొడాల మహేందర్, రఘు, రమణ, బాపన్న, పోచ్చన్న పాల్గొన్నారు.

సరైన పత్తి ధర అందేలా చూడాలి

గుడిహత్నూర్: సీసీఐ ద్వారా చేపడుతున్న పత్తి కొనుగోళ్లలో రైతులకు సరైన ధర అందేలా చూడాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని మన్నూర్ సమీపంలో రాణి జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోళ్లను ప్రారంభించారు. రైతులు ప్రభుత్వం పేర్కొన్న విధంగా నాణ్యమైన పత్తిని తీసుకొచ్చి మంచి ధర పొందాలన్నారు. తొలి పత్తి బండిని తూకం వేయించి రైతును సన్మానించారు. కార్యక్రమంలో జిన్నింగ్ మిల్లు యజమానికి అమీర్ ధరాని, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్ ముండే, మాజీ ఏఎంసీ చైర్మన్ తిరుమల్ గౌడ్, భీంరావ్ నాయక్, దేవన్న, ప్రతాప్ సింగ్, జాదవ్ రమేశ్ పాల్గొన్నారు.


చేప పిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

తలమడుగు: మండలంలోని సుంకిడి గ్రామంలో శుక్రవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ వెంకటేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజల పక్షాన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదిలాబాదులో నిలదీసినందుకు కాంగ్రెస్ నాయకులు కేటీఆర్‌ను విమర్శించడం సరికాదన్నారు. రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పటి వరకు చేయలేదు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పిడుగు అభిరామ్ రెడ్డి, కిరణ్ కుమార్, మగ్గిడి ప్రకాష్, తోట శ్రీనివాస్, నాగరెడ్డి కృష్ణ, వామన్, రమాకాంత్, ఆసం రవీందర్ పాల్గొన్నారు.

గుడిహత్నూర్: కేటీఆర్ దిష్టిబొమ్మ దహనానికి నిరసనగా బీఆర్‌ఎస్ నాయకులు మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆదిలాబాద్ సభలో కేటీఆర్ వాస్తవాలు మాట్లాడితే కాంగ్రెస్ నాయకులకు మింగుడు పడలేదన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చని సీఎం రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. వెంటనే పోలీసులు వచ్చి దిష్టిబొమ్మను తొలగించారు.


సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

రుణాలు సకాలంలో అందేలా చూడాలి

నార్నూర్: ఎస్‌ఎస్‌జీ, వీవో గ్రూపులకు బ్యాంకు లింకేజీ రుణాలు సకాలంలో అందేలా చూడాలని డీఆర్‌డీవో సాయన్న అన్నారు. శుక్రవారం గాదిగూడ మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. మహిళలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రూ. 1,44,600లతో కొనుగోలు చేసిన కాజా, గుండి మిషన్‌ను మహిళా సంఘాలతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తీసుకున్న రుణాలను సక్రమంగా కట్టేలా చూడాలన్నారు. ముఖ్యంగా పాడుపుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట ఏపీఎం మాధవి, తదితరులు పాల్గొన్నారు.


మిషన్‌ను ప్రారంభిస్తున్న డీఆర్‌డీవో సాయన్న

తేమ శాతం 20కి పెంచాలి

ఎదులాపురం: పత్తి తేమను 20 శాతానికి పెంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో పత్తి కొనుగోలు ప్రారంభ రోజునే పత్తి రైతులు దగాకు గురయ్యారని అన్నారు. తేమ శాతాన్ని 8 నుంచి 12గా విధిస్తూ పత్తికి క్వింటాలుకు సీసీఐ రూ.7521, ప్రైవేటు వ్యాపారాలు రూ. 7150గా గిట్టుబాటు ధరను నిర్ణయించారని పేర్కొన్నారు. తేమ శాతం రూ.20కి పెంచాలని, అలాగే క్వింటాలు పత్తికి రూ.10 వేలు ధర అందించాలన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

ఆదిలాబాద్‌టౌన్: చదువుతో పాటు విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం అన్నారు. ఆర్బీఐ 90వ వార్షికోత్సవాల సందర్భంగా సెప్టెంబర్ 19 నుంచి 21 వరకు కళాశాలలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో కళాశాల స్థాయిలో గెలుపొందిన విద్యార్థినులు ఎస్.శ్రీజ, పి.విఘ్నేశ్వరిలను శుక్రవారం సన్మానించారు. ఈసందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే అన్నిరంగాల్లో అవగాహన పెంచుకోవాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలో కూడా సత్తా చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రఘుగణపతి, కృనాల్, సౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

భీం వర్ధంతి జెండా ఆవిష్కరణ


జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

నేరడిగొండ: మండలంలోని కుంటాల జలపాతం వద్ద శుక్రవారం ఆదివాసీ నాయకులు కుమురం భీం జెండా ఆవిష్కరించారు. భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జల్ జంగల్ జమీన్ కోసం పోరాడిన భీంను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో గ్రామపటేల్, ఆడ మానిక్ రావు, సార్‌మేడి ఆత్రం గంగారాం, తొడసం లక్ష్మణ్, సిడం గంగారాం, గోడం అమృత్ పాల్గొన్నారు.

సిద్దిపేటలో పర్యటించిన బల్దియా కమిషనర్

కైలాస్‌నగర్: సిద్దిపేట మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణ బాగుందని ఆదిలాబాద్ మున్సిపాలిటీలోనూ అదే తరహా చర్యలను అమలు చేసేలా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ అన్నారు. శుక్రవారం సానిటరీ ఇన్‌స్పెక్టర్లు బైరి శంకర్, నరేందర్‌లతో కలిసి ఆయన సిద్దిపేటలో పర్యటించారు. మున్సిపాల్ కమిషనర్లు, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి అక్కడి బల్దియా చేపట్టిన పారిశుధ్య చర్యలను పరిశీలించారు.

ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే

ఆదిలాబాద్‌రూరల్: ప్రపంచంలో, దేశంలో ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకట్రాములు అన్నారు. శుక్రవారం మండలంలోని యాపల్‌గూడలో సీపీఎం ఆదిలాబాద్ ఏరియా కమిటీ మహాసభలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు లంకా రాఘవులు సీపీఎం జెండా ఆవిష్కరించారు. మహాసభ ప్రారంభానికి ముందు అమరవీరులకు 2 నిముషాలు మౌనం పాటించారు. పెట్టుబడుదారుల పెత్తనం కోసం దేశాల మధ్య దేశాల మధ్య యుద్ధాలు సృష్టించి ప్రజల ప్రాణాలు తీస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశ్, లంకా రాఘవులు, పూసం సచిన్, కిరణ్, బొజ్జ ఆశన్న, మంజుల, ఆత్రం కిష్టన్న, సురేందర్, గంగన్న, స్వామి, ఉయిక విష్ణు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకట్రాములు

పశుగణన సర్వేకు సహకరించాలి

తలమడుగు: గ్రామ గ్రామాన నిర్వహించే 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమానికి పశుపోషకులు సహకరించాలని పశుసంవర్ధక శాఖ అధికారి కిషన్ కోరారు. శుక్రవారం మండలంలోని బరంపూర్ గ్రామంలో అఖిలభారత పశుగణన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే పశుగణన సర్వేకు పశుపోషకులు సహకరించాలన్నారు. స్థూల ఆదాయం, జీడీపీ పెంచుకోవడానికి సర్వే ఆధారపడుతుందన్నారు. అన్ని గ్రామాలలో పశుశాఖ సిబ్బంది ఇంటింటికీ వచ్చి అన్ని జాతుల పక్షుల, పశువుల పశుగణన సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేఖర్, సహకార సంఘ చైర్మన్ దామోదర్ రెడ్డి, పశువైద్యాధికారి లావణ్య, దూదిరాం రాథోడ్, హరీష్, సౌమ్య, విశాల్, ప్రసాద్, విజయ్, సుదర్శన్, కేదారేశ్వర్ రెడ్డి, రంజిత్ రెడ్డి పాల్గొన్నారు.


పశుగణన నిర్వహిస్తున్న పశువైద్య సిబ్బంది

'ఆహార భద్రత ప్రమాణాలు పాటిస్తున్నాం'

ఎదులాపురం: ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా 2006 యాక్ట్ ప్రకారం ఆహార భద్రత, ప్రమాణాలు పాటిస్తూ వ్యాపారం చేస్తున్నట్లు వాణిజ్య, వర్తక, వ్యాపార సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంద్రత్ సంతోష్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఇటీవల టాస్క్‌ఫోర్స్ బృందం పేరిట కొంత మంది అధికారులు ఇష్టారీతి వ్యవహరించారని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పరామర్శ

ఆదిలాబాద్‌టౌన్: మాజీ మంత్రి గంగుల కమలాకర్ మాతృమూర్తి లక్ష్మీనర్సమ్మ ఇటీవల మృతిచెందారు. దీంతో మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న శుక్రవారం కరీంనగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు.

ఆన్‌లైన్‌లో 'ఓపెన్ హౌజ్'


ఓపెన్ హౌజ్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

బోథ్: ఆదిలాబాద్ జిల్లా పోలీసులు ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని సొనాల గ్రామంలోని వివేకానంద పాఠశాలలో ఆన్‌లైన్‌లో ఓపెన్ హౌజ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పోలీసులు విధులు, వినియోగించే ఆయుధాలు, పరికరాలు, డాగ్ స్క్వాడ్ విధులపై అవగాహన కల్పించారు.

కుమురం సూరుకు ఘన నివాళి

ఉట్నూర్‌రూరల్: మండలంలోని కొలాంగూడ గ్రామంలో కుమురం సూరు వర్ధంతి సభ శుక్రవారం నిర్వాహణ కమిటీ సభ్యులు నిర్వహించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సూరు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సూరు ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం ఆదివాసీ గ్రామాలపై దృష్టి సారించి మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. అనంతరం ఐటీడీఏ పీవో మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. ఐటీడీఏ ద్వారా వచ్చే పథకాలను గిరిజన లబ్ధిదారులకు సకాలంలో అందచేస్తామన్నారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ సభ్యురాలు కుంర ఈశ్వరీబాయి, రితేశ్ రాథోడ్, పీవీటీజీ ఏపీవో మనోహర్, జైవంత్‌రావు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

'కాంగ్రెస్‌ను తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధం'

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్‌ను తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. మోసపూరిత హామీలిచ్చిన సీఎం రేవంత్ రెడ్డిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఆదిలాబాద్ ఎమ్మెల్యే వాహనానికి ప్రమాదం

ఆదిలాబాద్: ఎమ్మెల్యే పాయల్ శంకర్ వాహనానికి శుక్రవారం స్వల్ప ప్రమాదం చోటు చేసుకుంది. హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద మూసీ బాధితులకు మద్దతుగా బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు హాజరై తన వాహనంలో ఆదిలాబాద్ చేరుకునే సమయంలో బాన్సువాడ వద్ద వెనుక నుంచి లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వాహనం వెనుక భాగం దెబ్బతింది. ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.


దెబ్బతిన్న కారు వెనక భాగం